క్లుప్తంగా

కుష్టు సర్వే పారదర్శకంగా చేపట్టండి



సర్వేపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

పెనుకొండ: కుష్టు వ్యాధి సర్వేను సక్రమంగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుష్టు వ్యాధి సర్వేపై ఆరా తీశారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



అర్చకుడికి విరాళం అందిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని కోట లక్ష్మీవేంకటరమణస్వామి ఆలయ అభివృద్ధికి మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కారదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వైవీ తిమ్మారెడ్డి, వైవీ శాంతమ్మ జ్ఞాపకార్థం నగదు రూపంలో ఆలయ అర్చకుడికి అందించారు.

బాలికల యూనిట్ ప్రారంభం



ఎంపికైన బాలికలు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో బాలికల యూనిట్‌ను మంగళవారం ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు తెలిపారు. కిందులో భాగంగానే 13 మంది బాలికలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు గుప్తా, కార్యదర్శి గిరిధర్, ఎంఈఓ సాల్మాన్‌రాజు, ఏఎస్ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



రొద్దం: మండల పరిధిలోని బూచర్ల గ్రామానికి చెందిన భారతి అనే గర్భిణి 108 వాహనంలో ప్రసవించినట్లు 108 టెక్నీషియన్ తిరుపతయ్య తెలిపారు. నొప్పులు రావడంతో బూచర్ల నుంచి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చినట్లు పేర్కొన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు రూ.19 లక్షలు చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు పంపిణీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పంపిణీ మంగళవారం చేశారు. నియోజకవర్గంలోని రైతులకు 100 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈఈ భూపతిరాజు, డీఈ నాగన్న సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిని ముంచుతున్న మంచు

- పొగమంచు ప్రభావంతో మాడిపోతున్న పూత
- పంటను ఆశిస్తున్న తేనె మంచు పురుగులు, తెగుళ్లు
- ఆందోళనలో మామిడి రైతులు



పెనుకొండ నియోజకవర్గంలో మామిడి విస్తీర్ణం

గోరంట్ల :	4,860	ఎకరాలు
రొద్దం :	1500	ఎకరాలు
పెనుకొండ :	900	ఎకరాలు
పరిగి :	940	ఎకరాలు
సోమందేపల్లి :	534	ఎకరాలు

రొద్దం: కొద్ది రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచు మామిడి రైతులను నట్టేట ముంచుతోంది. ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు కురుస్తునే ఉండడంతో మామిడి పూత మాడిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రాలుతున్న మామిడి పూత నివారణపై రైతులకు సూచనలిస్తున్న హెచ్ఓ రామ్‌ప్రసాద్

8,734 ఎకరాల్లో మామిడి

పెనుకొండ నియోజకవర్గంలో రైతులు 8,734 ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అంతగా అనుకూలించకపోవడంతో మామిడి తోటల్లో పూత ఆలస్యంగా వచ్చింది. అయితే అరకొరగా వచ్చిన పూత కూడా రాలిపోతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అల్పపీడన ప్రభావడంతో డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలు మామిడి పంటకు నష్టం కలిగించాయి. వర్షాల వల్ల పూత రాకపోగా ముందే అక్కడక్కడా అరకొరగా వచ్చిన మామిడి పూత సైతం ఇప్పుడు రాలిపోతుండడంతో పాటు ఆకులు నల్లగా మాడిపోతున్నాయి. వర్షం వల్ల జరిగిన నష్టం నుంచి పంట తేరుకుంటుందనుకునే సమయంలో మంచు రూపంలో మళ్లీ పంటకు నష్టం కలుగుతోంది. పొగ మంచు వల్ల పంటకు తేనె మంచు పురుగు ఇతర తెగుళ్లు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



రొద్దంలో కురుస్తున్న మంచు

మంచుతో పూత రాలుతోంది



మాకున్న 7 ఎకరాల పొలంలో మామిడి పంట సాగు చేశాము. వర్షాల వల్ల పూత రాకపోగా ముందే అక్కడక్కడా అరకొరగా వచ్చిన పూత కూడా ఇప్పుడు రాలిపోతున్నాయి. దీనికి తోడు ఆకులు నల్లగా మాడిపోతున్నాయి. వర్షం వల్ల జరిగిన నష్టం నుంచి పంట తేరుకుంటుందనుకునే సమయంలో మంచు రూపంలో మళ్లీ పంటకు నష్టం కలుగుతోంది. పొగ మంచు వల్ల పంటను తేనె మంచు పురుగు ఇతర తెగుళ్లు ఆశిస్తున్నాయి. మంచు తీవ్రంగా ఉండడంతో మామిడి పూత రాలిపోతోంది. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కృష్ణారెడ్డి, రైతు, చిన్నకోడిపల్లి

సస్యరక్షణ పాటించాలి

మామిడి సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపడితే అధిక లాభాలు పొందవచ్చు. తేనె మంచు పురుగు వల్ల పూతరాలిపోయే అవకాశం ఉంది. నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని, లేదా క్లోరీపాస్ రెండు మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. పొటాష్ లోపంతో కూడా పూత రాలిపోయే అవకాశం ఉంది. 5 గ్రాముల పొటాషియం నైట్రేటును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకుంటే పూత నిలవడంతో పాటు నాణ్యత పెరుగుతుంది. మామిడి సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంభించాలి.

– రామ్‌ప్రసాద్, హెచ్ఓ, పెనుకొండ

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి కుంటుపడింది. కేవలం అంతర్గత కుమ్ములాటలతోనే కాలాన్ని గడిపేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పులేరు గ్రామంలో పులేరు గ్రామ పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను గాలికొదిలేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ వర్గాలకు చెందిన పేదలకు యాభై సంవత్సరాలకే ఫించన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత బీసీలను పట్టించుకోవడం లేదన్నారు. సవిత మంత్రిగా పేదలకు మంచి చేయాల్సింది పోయి కేవలం వైఎస్సార్‌సీపీని విమర్శించడమే పనిగా పెట్టుకుందన్నారు. ఇటీవల శాసన మండలిలో మంత్రి సవిత మాట్లాడిన మాటలు విని సిగ్గు పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలతో రాష్ట్ర పేద ప్రజలు మద్యం, గంజాయికి బానిసలయ్యారని పేర్కొనడం పేదలను అవమానించడమేనన్నారు. గత ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలు అందుకొన్న పేదలు సంక్షేమ పథకాల డబ్బుతో మద్యం, గంజాయికి బానిసలైన ఓ ఐదు కుటుంబాలను నియోజకవర్గంలో చూపించగలరా? అని ప్రశ్నించారు.

పార్టీ బలోపేతంపై దృష్టి

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేసుకునేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. అధికారం చేపట్టిన తరువాత గ్రామ కమిటీలకు పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అంతకు మందు ఉషశ్రీచరణ్ దంపతులకు పులేరు గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం పులేరు గ్రామ పంచాయతీ పార్టీ కమిటీలను ఏర్పాటు చేశారు. పులేరు గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా ప్రతాప్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా మహబూబ్‌జాన్, రైతు విభాగం అధ్యక్షుడిగా భాస్కరరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నాగప్ప, బీసీ సెల్ అధ్యక్షుడిగా బాలకృష్ణ, వెంకటేశులు, మైనార్టీ అధ్యక్షుడిగా బాషా, ఉపాధ్యక్షుడిగా బాబును ఎంపిక చేశారు. అలాగే అనుబంధ కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి, మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు గంపల వెంకటరమణారెడ్డి, జిల్లా ట్రెజరీ అధ్యక్షుడు బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం పోరాటం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలలు కావస్తున్నా హామీలను అమలు చేయడంలేదు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఆయన నాయకులతో కలిసి బుళ్లసముద్రం గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలో నెలకొన్ని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమై గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తించి అండగా నిలుస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తుత సీఎం చంద్రబాబు ఏనాడూ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన సూపర్ సిక్స్ హామీల అమలుకు పోరాటం కొనసాగించి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, ఎస్ఎన్ మూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీటీసీ రంగప్ప, నాయకులు హనుమంతరాయప్ప, వెంకటరంగారెడ్డి, రంగనాథ్ నాయకులు, స్థానిక కార్యకర్తలు తదితర పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టం అమలు చేయాలి

హిందూపురం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణలో విభజనతో తీవ్ర ఆందోళనకరంగా ఉందని సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాబోవు రోజుల్లో సచివాలయ ఉద్యోగులకు తీవ్రమైన పనిఒత్తిడితోపాటు మూడు విభాగాలు ఉద్యోగ భద్రత, సర్వీస్ రూల్స్, జాబ్‌చార్ట్ విషయంలో అన్యాయం జరిగే అవకాశాలు లేకపోలేదన్నారు. దివ్యాంగుల చట్టం 2016ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో తక్షణమే అమలు చేయాలన్నారు.

ఇస్తెమాకు పక్కాగా ఏర్పాట్లు



ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జరిగే ఇస్తెమాకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సవిత అధికారులకు సూచించారు. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇస్తెమాకు సంబంధించి అధికారులు, ముస్లిం పెద్దలతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

గోరంట్ల: స్థానిక వినాయనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం మంత్రి సవిత మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

'పురం'లో ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటన



ఆధునీకరించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా నిధులు తీసుకురావడంపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధునీకరించిన భవనాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ పునఃప్రారంభించారు. పట్టణాభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన జర్నలిస్టులకు రెండు నెలల్లోనే ఇంటి పట్టాలను కేటాయించి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే మరో కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా 112 మంది రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. అలాగే రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొని హెల్మెట్ ధరించి బైక్‌ను నడిపి అవగాహన కల్పించారు.

నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వెంకటేశ్



పావగడ: స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తుమకూరు జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన అధ్యక్షుడిగా మంగళవారం నియమితులయ్యారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆయన తుమకూరులో పదవీ స్వీకారం చేయనున్నారు. ఆయన ఎంపిక పట్ల మాజీ మంత్రి వెంకటరమణప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, తదితరులు హర్షం తెలిపారు.

స్వాతికి పీహెచ్‌డీ పట్టా



పావగడ: పట్టణానికి చెందిన జి భాగ్యలక్ష్మి, జి నాగయ్య దంపతుల కుమార్తె బీఎస్ స్వాతి భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తుమకూరు విశ్వ విద్యాలయంలో భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షుడు, అధ్యాపకుడు నాగభూషణ ఆధ్వర్యంలో 'ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ ల్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డోపెడ్ ఫాస్ఫరస్ ఫార్ మల్టీ ఫంక్షనల్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధనలకు గాను పీహెచ్‌డీ వచ్చింది.

వైభవంగా మాళవిక జాతర



కొడిగెనహళ్లిలో జ్యోతులు మోస్తున్న గ్రామస్తులు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలో మాళవిక అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానికులు పెద్ద ఎత్తున అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. అనంతనం గ్రామంలోని అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త సమాచారం

నిబంధనలు పాటించాలి

మడకశిర: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ రాగిరి రామయ్య సూచించారు. మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ల వాడకంపై అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

గుడిబండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్ఐ రాజుకుల్లాయప్ప పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి రోడ్డు నిబంధనలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.

ఆర్ఓ ఫిల్టర్, ఫర్నీచర్ వితరణ

మడకశిర: పట్టణంలో కోట వీధి ప్రాథమిక పాఠశాలను పూర్వ విద్యార్థి ఢిల్లీ కెనరా బ్యాంక్ ఏజీఎం జనార్ధన్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు ఆర్ఓ ఫిల్టర్, ఫర్నీచర్, బీరువాలను అందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రామిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చరణ్‌రెడ్డి

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవరెడ్డి తండ్రి రామిరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్‌రెడ్డి... రామిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మీదేవి, రొద్దం, పెనుకొండ మండల కన్వీనర్లు బి.తిమ్మయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

భూముల మ్యుటేషన్ ఎఫెక్ట్

- ఎఫ్ఏసీ నుంచి రీసర్వేకు డీటీ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా ఉన్న యూనిస్‌బాబును ఆగమేఘాలపై ఆ బాధ్యతల నుంచి తప్పించారు. టీడీపీ నేతలు చెప్పిన మాట వినకపోవడంతోనే ఆయన్ను తిరిగి రీసర్వే డీటీగా మార్చినట్లు తెలిసింది. ముఖ్యంగా యగ్నిశెట్టిపల్లిలో 100 ఎకరాల శ్రోత్రియం భూములను మ్యుటేషన్ చేయలేదన్న కారణంతోనే ఆయన్ను తప్పించారంటున్నారు. గతంలో టీడీపీ నాయకులే యూనిస్‌బాబుకు ఎఫ్ఏసీ ఇప్పించారని, మాట వినకపోవడంతో ఇప్పుడు మార్పించారని చెబుతున్నారు.

భూ వ్యవహారంపై నలుగురిపై కేసు

పరిగి: మండలంలోని ఊటుకూరు బసవనపల్లి సమీపంలో ఓ భూ వ్యవహారంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. ఊటుకూరు బసవనపల్లికి చెందిన విజయేంద్రరెడ్డి, నిస్సార్‌సాబ్ బెంగళూరుకు చెందిన అబ్దుల్ సలీంకు చెరువు పరిధిలో ఉన్న భూమిని అమ్మేందుకు పదేళ్ల క్రితం రూ.13 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈక్రమంలో 228 సర్వే నంబరుపైకి 4 ఎకరాలనుగాను చేసుకున్న అగ్రిమెంట్‌పై రూ.5 లక్షలు చెల్లించి సంతకాలు చేశారు. అయితే సదరు భూమి చెరువు పోరంబోకులో ఉన్నట్లు తెలుసుకుని తనను మోసం చేశారని బాధితుడు అబ్దుల్ సలీం పరిగి పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. తప్పుడు అగ్రిమెంట్ చేసిన విజయేంద్రరెడ్డి, నిస్సార్‌సాబ్‌తో పాటూ మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డుపై మంగళవారం సాయంత్రం ఎస్ఐ వీరేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించవారికి ఫైన్ విధించారు.

బంగారం అపహరణపై కేసు నమోదు

పెనుకొండ: పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో ఉపాధ్యాయుడు నాగార్జునుడు ఇంట్లో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగార్జునతో పాటు ఆయన భార్య కూడా టీచర్‌గా పనిచేస్తున్నారన్నారు. సోమవారం వారు డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న 47 తులాల బంగారం చోరీకి గురైందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.